సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

ఆదివారం । 31 । డిసెంబర్ । 2023



టమాట కిలో రూ.20

కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్ట ధర రూ.20 పలికింది. కనిష్టం రూ.8, సరాసరి రూ.14 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



ఆదర్శ గురుకులం

పరిశుభ్రత, పచ్చదనం, క్రమశిక్షణతో శింగనమల మండలం ఈస్ట్ నరసాపురం గురుకుల పాఠశాల అనతికాలంలోనే గుర్తింపు పొందింది.

8లో

గరిష్ఠం/కనిష్ఠం
33.6°/12.7°

జిల్లాలో శనివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం చలి తీవ్రత బాగా పెరిగింది. ఆగ్నేయం దిశగా గంటకు 4 నుంచి 6 కిలో మీటర్ల వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

వీరభద్రుని సేవలో మధ్యప్రదేశ్ హైకోర్టు జడ్జి



శిల్పకళను తిలకిస్తున్న జడ్జి కుటుంబీకులు

లేపాక్షి: మధ్యప్రదేశ్ హైకోర్టు జడ్జి దినేష్‌కుమార్ పలివాల్ శనివారం లేపాక్షి వీరభద్రుని సేవలో గడిపారు. శనివారం సాయంత్రం కుటుంబంతో కలిసి ఆలయానికి విచ్చేసిన ఆయనకు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం జడ్జి దినేష్‌కుమార్ పలివాల్ కుటుంబీకులతో కలిసి వీరభద్రస్వామి, దుర్గాదేవికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ విశిష్టత గురించి తెలుసుకోవడంతో పాటు ఆలయంలోని శిల్పాలు, చిత్రలేఖనాలను తిలకించి ఆశ్చర్యచకితులయ్యారు. ఈ సందర్భంగా ఆలయ కార్య నిర్వహణాధికారి నరసింహమూర్తి ఆధ్వర్యంలో దేవాదాయ సిబ్బంది జడ్జిని సత్కరించారు.

హద్దు దాటొద్దు

- యువతకు ఎస్పీ మాధవరెడ్డి హెచ్చరిక
- న్యూ ఇయర్ వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలని సూచన

పుట్టపర్తి టౌన్: నూతన సంవత్సర వేడుకలు అందరూ ఆనందంతో ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్పీ మాధవరెడ్డి సూచించారు. ఎవరైనా హద్దుదాటితే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. రానున్న ఆంగ్ల నూతన సంవత్సరంలో ప్రతి ఒక్కరికీ మేలు జరగాలని, ప్రతి కుటుంబంలో ఆనందం వెల్లువెరియాలని ఎస్పీ ఆకాంక్షిస్తూ జిల్లా ప్రజలకు నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. నూతన సంవత్సర వేడుకలు నిబంధనలకు లోబడి చేసుకోవాలన్నారు. రోడ్లపై కేక్ కట్ చేయడాన్ని పూర్తిగా నిషేధించామన్నారు. అలా కాకుండా రోడ్లపై కేక్ కటింగ్, డీజే సౌండ్ నడుమ చిందులు వేస్తే చూస్తూ ఊరుకోనేది లేదన్నారు. హోటళ్లు, దుకాణాలు, వ్యాపార సముదాయాలన్నీ నిర్ణీత సమయానికే మూసేయాలన్నారు. అనుమతి లేని ప్రదేశాల్లో మద్యం సేవించడాన్ని సహించబోమన్నారు. 31వ తేదీ అర్ధరాత్రి వరకూ 30 యాక్ట్ అమల్లో ఉంటుందని, ఆదివారం సాయంత్రం నుంచి జిల్లాలోని ప్రధాన పట్టణాల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహిస్తామన్నారు. ప్రత్యేక బృందాలతో డ్రంక్అండ్ డ్రైవ్ కొనసాగిస్తామన్నారు. అలాగే బైక్ రేసులు, ట్రిబుల్ రైడింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ఎవరైనా హద్దు మీరితే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు.

ఎంపీగా ఎవరిని నిలబెడదాం!

- 'పురం' సీటుపై టీడీపీ మల్లగుల్లాలు
- రేసులో నిమ్మల కిష్టప్ప, అంబికా లక్ష్మీనారాయణ
- బీసీ కార్డుతో అధిష్టానం వద్ద ఎవరికి వారు లాబీయింగ్

సాక్షి, పుట్టపర్తి

హిందూపురంలో టీడీపీ పరిస్థితి గందరగోళంగా మారింది. అసెంబ్లీ, పార్లమెంటు స్థానాలకు ఎవరిని బరిలో దింపాలనే దానిపై అధిష్టానం మల్లగుల్లాలు పడుతోంది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బాటలోనే టీడీపీ అధిష్టానం ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో బీసీ సామాజిక వర్గాల నుంచి పలువురు హిందూపురం పార్లమెంటు టికెట్ ఆశిస్తున్నట్లు పార్టీలో చర్చ జరుగుతోంది. ఎవరికి వారు టీడీపీ పెద్దలను కలిసి లాబీయింగ్ చేస్తున్నారని సమాచారం. అయితే వీరిలో ఎవరిని బరిలో దింపినా...మిగతా వారితో ఇబ్బందే అన్న ఆలోచనతో టీడీపీ అధిష్టానం పునరాలోచిస్తోంది. హిందూపురం పార్లమెంటులో టీడీపీ పరిస్థితి అంతంత మాత్రంగానే ఉందని, సొంత కేడర్ లేని వ్యక్తికి టికెట్ ఇస్తే అంతేసంగతులని ఆశావహులు అధిష్టానం వద్ద తమ అభిప్రాయం తెలిపినట్లు



సమాచారం.

అందరి పరిస్థితీ అంతంతే..

హిందూపురం పార్లమెంటు సీటుకు టీడీపీ తరఫున టికెట్ ఆశిస్తున్న వారిలో ఏ ఒక్కరికీ సొంత ఓటు బ్యాంకు లేదు. ప్రతి ఒక్కరూ పార్టీ బలంపై ఆధారపడాల్సిన పరిస్థితి. కనీసం వారి కులాల నుంచి కూడా సరైన మద్దతు లేదనేది స్పష్టం అవుతోంది. ఆయా కులాల ఓటు బ్యాంకు టీడీపీ కంటే వైఎస్సార్‌సీపీకే బలంగా ఉండటం విశేషం. వైఎస్సార్ సీపీ గత ఎన్నికల్లో ఉమ్మడి అనంతపురం జిల్లాలోని రెండు ఎంపీ స్థానాలు బీసీలకే ఇవ్వగా, ఈ సారి టీడీపీ తరఫున బోయ, కురుబ, చేనేత సామాజిక వర్గాల నేతలు హిందూపురం ఎంపీ సీటును ఆశిస్తున్నారు. అయితే ఆయా కులాలకు వైఎస్సార్‌సీపీ ఎనలేని గుర్తింపు ఇచ్చింది. నామినేటెడ్ పదవులతో పాటు రాజ్యాధికారం కట్టబెట్టింది. ఈ నేపథ్యంలో ఆయా సామాజిక వర్గాల నుంచి ఒకరిద్దరు నాయకులు తప్ప ఓటర్లు ఎవరూ టీడీపీ వైపు మొగ్గుచూపడం లేదని అధిష్టానికి తెలిసిపోయింది. దీంతో వారికి టికెట్ ఇచ్చేందుకు టీడీపీ అధిష్టానం ఒకటికి పదిసార్లు రహస్యంగా సర్వేలు చేయిస్తున్నట్లు తెలుస్తోంది.

నిమ్మల వర్సెస్ అంబికా..

2009లో కాంగ్రెస్ తరఫున హిందూపురం ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయిన అంబికా లక్ష్మీనారాయణ ఆ తర్వాత టీడీపీలో చేరారు. అయితే టీడీపీ ఆయనకు ఇప్పటివరకు ఒకసారి కూడా టికెట్ ఇవ్వలేదు. ప్రస్తుతం ఆయన హిందూపురం ఎంపీ సీటు ఆశిస్తున్నట్లు తెలుస్తోంది. బోయ సామాజిక వర్గానికి చెందిన అంబికా లక్ష్మీనారాయణకు సొంత కులంలో బలం లేదని సమాచారం. మరోవైపు బోయ సామాజిక వర్గంలో చాలా మంది వైఎస్సార్ సీపీ వెంట నడుస్తుండటం తెలిసిందే. ఇక నేసే సామాజిక వర్గానికి చెందిన మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప ఎంపీ సీటుకు మరోసారి పోటీ చేయాలని ఆశిస్తున్నారు. లేదంటే తనకు పెనుకొండ అసెంబ్లీ టికెట్ ఇవ్వాలనే డిమాండ్‌ను అధిష్టానం ముందు ఉంచినట్లు తెలిసింది. నిమ్మల కూడా ఆ సామాజిక వర్గంలో పెద్దగా ప్రభావం చూపించలేరని కార్యకర్తలే చెప్పుకుంటున్నారు.

రేసులో మరికొందరు..

హిందూపురం ఎంపీ స్థానం నుంచి అంబికా, నిమ్మలతో పాటు పుట్టపర్తికి చెందిన సామకోటి ఆదినారాయణ కూడా పోటీ చేయాలని భావిస్తున్నారు. మరోవైపు పెనుకొండ అసెంబ్లీ టికెట్ ఇవ్వకపోతే కనీసం ఎంపీ సీటైనా ఇవ్వాలని ఇటు సవితమ్మ అటు బీకే పార్థసారథి కోరుతున్నట్లు తెలిసింది. అయితే అధిష్టానం నుంచి ఎవరికీ హామీ దక్కలేదని సమాచారం. బీసీ కులాల నుంచి సమర్థుడు దొరకడం లేదని పార్టీ పెద్దలు చర్చించుకున్నట్లు మరికొందరు ప్రచారం చేస్తున్నారు.

వెంటాడుతున్న ఓటమి భయం..

ఓటమి భయంతో కొందరు టీడీపీ నేతలు హిందూపురం పార్లమెంటు స్థానం నుంచి పోటీ చేసేందుకు ముందుకు రావడం లేదని సమాచారం. టికెట్ రేసులో ఉన్నవారిలో ఒకరికి టికెట్ ఇస్తే మరోవర్గం అసమ్మతి వ్యక్తం చేయడం ఖాయంగా చెబుతున్నారు. గ్రూపు రాజకీయాలతో పోటీలో ఉన్న వారు బలి కావడం ఖాయమని అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో 'పురం' ఎంపీ స్థానం నుంచి ఎవరిని బరిలో నిలపాలన్నది టీడీపీ అధిష్టానానికి పెద్ద సవాలుగా మారింది.

త్వరలోనే కంది కొనుగోలు కేంద్రాలు

- క్వింటాకు రూ.7 వేల మద్దతు ధర ప్రకటించిన ప్రభుత్వం
- సద్వినియోగం చేసుకోవాలని డీఏఓ సుబ్బారావు పిలుపు



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు

కదిరి అర్బన్: జిల్లా వ్యాప్తంగా త్వరలోనే కంది కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు వ్యవసాయశాఖ అధికారి (డీఏఓ) సుబ్బారావు, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ నారాయణనాయక్ తెలిపారు. శనివారం స్థానిక వ్యవసాయ పరిశోధన స్థానంలో కంది కొనుగోలు కేంద్రాల నిర్వహణపై రైతు భరోసా కేంద్రం సిబ్బందికి ఒక రోజు శిక్షణ ఇచ్చారు. వ్యవసాయ, పౌరసరఫరాల శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి డీఏఓ సుబ్బారావు ముఖ్య అతిథిగా హాజరై మట్లాడారు. గత ఖరీఫ్‌లో కంది సాగుచేసిన రైతులకు ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం క్వింటాకు రూ.7 వేల మద్దతు ధర ప్రకటించిందన్నారు. ఈ-క్రాప్‌లో పంట నమోదు చేసుకున్న రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ నారాయణ నాయక్ మాట్లాడుతూ, రైతు భరోసా కేంద్రాల్లో కంది కొనుగోళ్లు చేపడతామన్నారు. కొనుగోళ్ల సమయంలో యాప్ ద్వారా రిజిస్ట్రేషన్, విత్తన తేమ శాతం, విత్తనశుద్ధి పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త చంద్రాయుడు, కదిరి డివిజన్ పరిధిలోని మండల వ్యవసాయ అధికారులు, రైతు భరోసా సిబ్బంది పాల్గొన్నారు.

అట్రాసిటీ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

- కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశం

పుట్టపర్తి అర్బన్: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని జిల్లాలో పకడ్బందీగా అమలు చేసే బాధ్యత అందరిపై ఉందని కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ మాధవరెడ్డి అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా స్థాయి విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్, ఎస్పీతో పాటు జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, పెనుకొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్, డీఆర్‌ఓ కొండయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పుట్టపర్తి పరిసర ప్రాంతాల్లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు స్థలాన్ని సేకరించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు కార్యక్రమాలు నిర్వహించాలని కమిటీ మెంబర్లకు సూచించారు. ఎస్సీ, ఎస్టీలకు శ్మశాన వాటికలు ఉండేలా చూడాలని, వాటికి అవసరమైన భూమిని వారం రోజుల్లో గుర్తించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో ఎస్సీ, ఎస్టీ చట్టం అమలు కమిటీ సమావేశాలు నిర్వహించాలని, వాటి వివరాలను కమిటీ సభ్యులకు తెలియజేసే బాధ్యత సంబంధిత ఆర్డీఓలు, తహసీల్దార్లపై ఉందన్నారు. వంద ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో బాధితులకు పరిహారం అందించామన్నారు. మలకవేముల ఎస్సీ, ఎస్టీ భూ సమస్యపై త్వరలో జేసీ స్వయంగా క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారన్నారు.



విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు, చిత్రంలో ఎస్పీ మాధవరెడ్డి

జనవరి 2వ తేదీన సీకేపల్లి మండలం బసంపల్లిలో దళితుల శ్మశానవాటిక సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. అలాగే ముదిగుబ్బ మండలం జేకేపల్లి తండాలో సీసీ రోడ్డు నిర్మాణానికీ చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇక ఎస్సీ, ఎస్టీ సమస్యల పరిష్కారానికి పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తుందని ఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ డీడీ శివరంగ ప్రసాద్, డీఎస్పీలు వాసుదేవన్, శ్రీలత, వరప్రసాద్, శ్రీనివాసులు, హుస్సేన్‌పీరా, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, కమిటీ సభ్యులు వీరనారాయణ, ఆరుద్ర, శ్రీనివాసులు, గంగులయ్య, సురేష్, శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.

మ్యానువల్ స్కావెంజింగ్‌ను నిషేధించాలి..

జిల్లాలో మ్యానువల్ స్కావెంజింగ్ (మలం, మురుగును చేతితో ఎత్తివేయడం)ను పూర్తిగా నిషేధించి ఆ వృత్తిపై ఆధారపడిన వారికి పునరావాసం కల్పించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశించారు. శనివారం ఆయన కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో మ్యానువల్ స్కావెంజింగ్ చట్టం 2013 నియమాలు, పునరావాసంపై జేసీ అభిషేక్ కుమార్, సబ్ కలెక్టర్ అపూర్వ భరత్, డీఆర్‌ఓ కొండయ్యతో కలిసి సమీక్షించారు. 2013 డిసెంబర్ 6వ తేదీ నుంచి మ్యానువల్ స్కావెంజింగ్‌పై నిషేధం అమలులో ఉందన్నారు. మ్యానువల్ స్కావెంజింగ్ కోసం ఏ వ్యక్తినీ నియమించరాదన్నారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే రెండేళ్ల జైలు, రూ.లక్ష జరిమానా, లేదా రెండూ విధించే ఆస్కారం ఉందన్నారు. జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలు, మేజర్ పంచాయతీల్లో పనిచేసే పారిశుధ్య కార్మికులకు గ్లౌజులు, బూట్లు, మాస్క్‌లు సరఫరా చేయాలని అధికారులకు ఆదేశించారు. జిల్లాలోని 14 మంది సఫాయి, చర్మ కార్మికులకు రుణాలు అందించామన్నారు. స్కావెంజర్లు, వారిపై ఆధారపడిన కుటుంబీకులకు రెండేళ్ల వరకూ రూ.3 వేల చొప్పున భృతి చెల్లిస్తూ, నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ ఇచ్చి మరో రంగంలో ఉపాధి కల్పిస్తామన్నారు. అలాగే స్వయం ఉపాధి కోసం రూ. 5 లక్షల వరకూ మూల ధన సబ్సిడీ ఇస్తారన్నారు. సమావేశంలో కమిటీ సభ్యులు ఈశ్వరయ్య, నాగలక్ష్మి, లక్ష్మీనారాయణ, వెంకటేశు, డ్వామా పీడీ విజేయంద్ర ప్రసాద్, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, పుట్టపర్తి, ధర్మవరం, కదిరి ఆర్డీఓలు భాగ్యరేఖ, రమేష్‌రెడ్డి, వంశీకృష్ణారెడ్డి, డీపీఓ విజయ్‌కుమార్, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ అధికారులు శివరంగప్రసాద్, మోహన్‌రాం తదితరులు పాల్గొన్నారు.

నేరాలకు కళ్లెం

- జిల్లాలో నేరాల అదుపునకు పోలీసుల ప్రత్యేక చర్యలు
- గణనీయంగా తగ్గిన చోరీలు, మహిళలపై నేరాలు
- 'దిశ'తో మహిళలకు సత్వర న్యాయం
- 2023 వార్షిక నేరాల నివేదిక వెల్లడించిన ఎస్పీ మాధవరెడ్డి

పుట్టపర్తి టౌన్: క్షేత్రస్థాయిలో పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయడం వల్ల ఈఏడాది జిల్లాలో నేరాలు తగ్గుముఖం పట్టాయని ఎస్పీ మాధవరెడ్డి తెలిపారు. శనివారం ఆయన జిల్లా పోలీస్ కార్యాలయంలోని 'స్పందన' వీడియో కాన్ఫరెన్స్ హాలులో విలేకరులతో మాట్లాడారు. 2023 సంవత్సరంలో జిల్లాలో నమోదైన వివిధ కేసుల గణాంకాలు, బాధితులకు చేసిన న్యాయం, పోలీస్ శాఖ పనితీరుపై వార్షిక నివేదికను మీడియాకు వివరించారు.

సాంకేతిక పరిజ్ఞానంతో నేరాలకు అడ్డుకట్ట..

అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడంతో పాటు పీడీ చట్టం ప్రయోగం, పల్లెనిద్ర తదితర చర్యలతో జిల్లాలో గత ఏడాదితో పోలిస్తే నేరాలు 33 శాతం తగ్గాయని ఎస్పీ మాధవరెడ్డి తెలిపారు. నేరాల నియంత్రణలో జిల్లా పోలీసులు పాత్ర చాలా ఉందన్నారు. ప్రజాహిత పోలీసింగ్‌కు ప్రాధాన్యత ఇచ్చామని తెలిపారు. ఇక త్వరలోనే జరగనున్న సార్వత్రిక ఎన్నికల నిర్వహణపై దృష్టి సారించాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో డీఎస్పీలు శ్రీనివాసులు, వాసుదేవన్, శ్రీలత, కంజాక్షన్, హుస్సేపీరా, స్పెషల్‌బ్రాంచ్ సీఐ రవీంద్రారెడ్డి, డీసీఆర్‌బీ సీఐ శ్రీహర్ష, ఎస్ఐ ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న ఎస్పీ మాధవరెడ్డి

వార్షిక నివేదికలో ప్రధానాంశాలు ఇలా..

- అసాంఘిక కార్యకలాపాలపై జిల్లా పోలీసులు ఉక్కుపాదం మోపారు. గత ఏడాది మొత్తం 763 కేసులు నమోదు చేయడంతో పాటు ఆయా కేసుల్లో నిందితులైన 2,112 మందిని అరెస్ట్ చేశారు. రూ 66,36,257 స్వాధీనం చేసుకున్నారు.
- గంజాయి విక్రయాలపై ముమ్మర దాడులు జరిపి 16 కేసులు నమోదు చేశారు. 83 మంది అరెస్ట్ చేసి 548.17 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు.
- గత ఏడాది 353 ప్రాపర్టీ కేసులు నమోదు కాగా, ఈ ఏడాది 236 ప్రాపర్టీ కేసులు (23.38 శాతం తగ్గుదల) నమోదయ్యాయి.
- పదే పదే నేరాలకు పాల్పడుతున్న జిల్లాలోని 8 మందిపై పీడీ యాక్ట్ ప్రయోగించారు. ఇక అక్రమ మద్యంపై 493 కేసులు నమోదు చేసి 8894.97 లీటర్ల అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.
- ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు ఈ ఏడాది జిల్లా పరిధిలో 85 నమోదయ్యాయి.
- రోడ్డు భద్రతా నియమాలపై వాహనదారులకు అవగాహన కల్పించడంతో పాటు డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ప్రత్యేక దృష్టి సారించడంతో ఈ ఏడాదిలో 531 రోడ్డు ప్రమాద కేసులు నమోదయ్యాయి.
- గత ఏడాది 31 కిడ్నాప్ కేసులు నమోదు కాగా, ఈ ఏడాది 20 కేసులు (35.48 శాతం తగ్గుదల) నమోదయ్యాయి.

40 శాతం తగ్గిన మహిళలపై నేరాలు

- మహిళలపై నేరాల నియంత్రణకు పోలీసులు పటిష్ట చర్యలు తీసుకోవడం ఫలితానిచ్చింది. గత ఏడాదితో పోలిస్తే 40.02 శాతం కేసులు తగ్గాయి. 2022లో మహిళలపై జరిగిన నేరాలకు సంబంధించి 867 కేసులు నమోదు కాగా, ఈ ఏడాది 520 కేసులు నమోదయ్యాయి.
- ఆత్మహత్యలకు సంబంధించి గత ఏడాది 32 కేసులు నమోదు కాగా, ఈ ఏడాది 12 నమోదయ్యాయి. కిడ్నాప్ కేసులు 2022లో 51 నమోదు కాగా, ఈ ఏడాది 21 నమోదయ్యాయి. మహిళపై దౌర్జన్యాలకు సంబంధించి గత ఏడాది 492 కేసులు నమోదు కాగా, ఈ ఏడాది 183 కేసులు బుక్ అయ్యాయి.

12 కేసుల్లో ముద్దాయిలకు శిక్ష

- పోలీసులు ప్రత్యేక దృష్టి సారించి కోర్టులో మానిటరింగ్ సెల్ ఏర్పాటు చేయడంతో కేసుల విచారణ కూడా వేగవంతమైంది. ఈ ఏడాది పరిధిలో 12 కేసుల్లో ముద్దాయిలకు శిక్షలు పడ్డాయి. ఇక లోక్ అదాలత్ ద్వారా 3,022 కేసులు పరిష్కారమయ్యాయి.
- పోలీసు స్పందన కార్యక్రమానికి 2,854 అర్జీలు అందగా, పోలీసులు 2,829 అర్జీలకు పరిష్కారం చూపారు. సెల్‌ఫోన్ మిస్సింగ్‌కు సంబంధించి 667 ఫిర్యాదులు అందగా, 346 మొబైల్ ఫోన్లు రికవరీ చేశామని ఎస్పీ వెల్లడించారు.

తగ్గిన హత్యలు..

నిఘా పెరగడంతో పాటు ట్రబుల్‌మాంగర్స్, అసాంఘిక, అరాచక శక్తులపై పోలీసులు నిఘా తీవ్రతరం చేయడంతో హత్య కేసులు కూడా ఈ ఏడాది 43 శాతం తగ్గాయి. గత ఏడాది 48 హత్య కేసులు నమోదు కాగా, ఈ ఏడాది 27 నమోదయ్యాయి. ఇక హత్యాయత్నం కేసులు గత ఏడాది 63 నమోదు కాగా, ఈ ఏడాది 59 నమోదయ్యాయి.

- హత్యాయత్నం కేసులు గత ఏడాది జిల్లాలో 39 నమోదు కాగా, ఈ ఏడాది 29 నమోదయ్యాయి.
- చీటింగ్ కేసులు గతే ఏడాది 246 నమోదు కాగా, ఈ ఏడాది 245 కేసులు నమోదయ్యాయి.

క్లుప్తంగా

ఏపీటీఎఫ్ డైరీ ఆవిష్కరణ



డైరీని ఆవిష్కరించిన కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) డైరీని కలెక్టర్ అరుణ్‌బాబు శనివారం ఆవిష్కరించారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఏపీటీఎఫ్ 76 వసంతాల డైరీని ఆవిష్కరించి పలువురికి అందజేశారు. ఉపాధ్యాయులకు ఉపయోగపడే పలు జీఓలు పొందుపరచడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కోనంకి చంద్రశేఖ, ఉపాధ్యక్షుడు అశోక్‌కుమార్, జిల్లా గౌరవాధ్యక్షుడు మాధవ, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి చంద్ర, బలరాముడు, శ్రీనివాసులు, మండల శాఖ భరిప్రసాద్, రాజశేఖర్, ఎల్ చంద్ర, విశ్వనాథ్, చెన్నకేశవ తదితరులు ఉన్నారు.

యువకుడి ఆత్మహత్య



మృతుడు పురుషోత్తం

ధర్మవరం అర్బన్: ఉరి వేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన పట్టణంలోని చంద్రబాబునగర్‌లో జరిగింది. టూటౌన్ పోలీసులు తెలిపిన మేరకు.. చంద్రబాబునగర్‌కు చెందిన చేనేత కార్మికుడు రాము కుమారుడు పురుషోత్తం (25) డిగ్రీ వరకు చదువుకున్నాడు. ఇటీవల పట్టుచీరల వ్యాపారం ప్రారంభించాడు. ఇందుకోసం దాదాపు రూ.3 లక్షల అప్పులు చేశాడు. అప్పులు తీర్చే మార్గం కానరాలేదు. శనివారం మనోవేదనకు గురై ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి వివాహం కాలేదు. టూటౌన్ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తండ్రి రాము ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సచివాలయ ఉద్యోగిపై దాడి

చిలమత్తూరు: సచివాలయ ఉద్యోగిపై పలువురు దాడికి పాల్పడ్డారు. ఎస్ఐ గంగాధర్ తెలిపిన మేరకు.. మండలంలోని కోడూరు-2 సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా శ్రీకాంత్ పనిచేస్తున్నాడు. శనివారం ఉదయం పాల ప్యాకెట్ల పంపిణీ కోసం బయోమెట్రిక్ వేయాల్సి ఉండగా, తన మొబైల్‌లో సాంకేతిక సమస్య ఉండటంతో అంగన్‌వాడీల ఫోన్‌లో యాప్ ఇన్‌స్టాల్ చేసి డబ్బు వేద్దామని అనుకొన్నాడు. ఈ క్రమంలోనే పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు ఆయనతో వాగ్వాదానికి దిగారు. దుర్భాషలాడారు. వారికి సీఐటీయూ నేతలు కూడా సహకరించారు. తనను దూషిస్తూ దాడి చేశారని శ్రీకాంత్ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు ఆరుగురిపై కేసు నమోదు చేశారు. కాగా, అంగన్‌వాడీ కార్యకర్తలు, సీఐటీయూ నేతలు కూడా సచివాలయ ఉద్యోగిపై ఫిర్యాదు చేశారు. ఎస్ఐ గంగాధర్ మాట్లాడుతూ ఇరు వర్గాలు ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకున్నారని, ఇరువురిపై కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు.

ఆదర్శ గురుకులం



పాఠశాల ఆవరణలో ఆకుకూరల పెంపకాన్ని పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ సంగీతకుమారి

పాఠశాలలోకి అడుగుపెట్టగానే పరిశుభ్రమైన వాతావరణం స్వాగతం పలుకుతుంది. పచ్చని మొక్కలు పలకరిస్తాయి. తరగతి గదుల గోడలపై రాసిన 'కొటేషన్లు' ఆకట్టుకుంటాయి. దేశ నాయకుల చిత్రాలు వారి త్యాగాలను, ఘనతను గుర్తుకు తెస్తాయి. విద్యార్థినుల క్రమశిక్షణ ముచ్చటగొల్పుతుంది. మొత్తంగా అక్కడి వాతావరణం అలనాటి 'గురుకులాన్ని' తలపిస్తుంది.

- ప్రత్యేకత చాటుకుంటున్న 'ఈస్ట్ నరసాపురం గురుకుల పాఠశాల'
- ఆహ్లాదకర వాతావరణం, అత్యుత్తమ బోధనా ప్రమాణాలు
- విద్యార్థినుల సమగ్ర వికాసానికి కృషి
- ప్రిన్సిపాల్ చొరవతో నందనవనంగా విద్యానిలయం

సాక్షి, అనంతపురం డెస్క్: 'ఈస్ట్ నరసాపురం' మహాత్మాజ్యోతిరావు పూలే ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలను ప్రారంభించిన అనతికాలంలోనే చక్కటి విద్యానిలయంగా గుర్తింపు తెచ్చుకుంది. ప్రిన్సిపాల్ ప్రత్యేక చొరవ, ప్రభుత్వం, దాతల సహకారంతో కార్పొరేట్ విద్యాసంస్థలను తలదన్నేలా పాఠశాలను తీర్చిదిద్దారు. 2022 జనవరి 24న ఈ పాఠశాలను ప్రారంభించారు. 5 నుంచి 10వ తరగతి వరకు 340 మంది విద్యార్థినులు చదువుతున్నారు. శింగనమల మండలం ఈస్ట్ నరసాపురం వద్ద శాశ్వత భవనాలు నిర్మించనున్నారు. ప్రస్తుతం పాఠశాలను నార్పల మండల కేంద్రంలోని ఇంటిగ్రేటెడ్ హాస్టల్ భవనంలో నిర్వహిస్తున్నారు. ఈ భవనం ఇంతకుముందు నిరుపయోగంగా ఉండేది. గురుకుల పాఠశాలను ప్రారంభించిన తర్వాత సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు.

ప్రిన్సిపాల్ ప్రత్యేక చొరవ

'ఈస్ట్ నరసాపురం' గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌గా కె.సంగీత కుమారి ఉన్నారు. ఈమె జిల్లా గురుకుల పాఠశాలల కన్వీనర్‌గానూ వ్యవహరిస్తున్నారు. పాఠశాలను తాత్కాలిక భవనాల్లో ప్రారంభించినప్పటికీ ప్రత్యేక శ్రద్ధతో ఆదర్శవంతమైన విద్యానిలయంగా తీర్చిదిద్దారు. పాఠశాల సమీపంలోనే నివాసముంటూ నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. పాఠశాల అభివృద్ధిలో సిబ్బందిని, విద్యార్థినులను, వారి తల్లిదండ్రులను భాగస్వామ్యం చేశారు. మూడు నెలలకు ఒకసారి తల్లిదండ్రుల సమావేశం నిర్వహిస్తున్నారు. చిన్నచిన్న మరమ్మతులు, ఇతరత్రా అభివృద్ధి పనులకు వారి సహకారం కోరుతున్నారు. విద్యార్థినుల తల్లిదండ్రుల్లో ఎవరైనా వృత్తినిపుణులు ఉంటే వారి సేవలనూ వినియోగించుకుంటున్నారు. ఆర్డీటీ, డిస్కవరీ అనంత, ఆలూరి ఫౌండేషన్ తదితర సంస్థలు, దాతల సహకారంతో పాఠశాలకు సీసీ కెమెరాలు, ల్యాప్‌టాప్‌లు, క్రీడా పరికరాలు, మినరల్ వాటర్‌ప్లాంట్ లాంటి సౌకర్యాలను సమకూర్చారు.

విద్యతో పాటు అదనపు నైపుణ్యాలు

కేవలం చదువు ఉంటేనే సరిపోదు. జీవితంలో పైకి రావాలంటే అదనపు నైపుణ్యాలు కూడా అవసరం. అందువల్లే 'ఈస్ట్ నరసాపురం' గురుకుల పాఠశాల విద్యార్థినులకు చదువుతో పాటు అదనపు నైపుణ్యాలు పెంపొందిస్తున్నారు. ప్రతి విద్యార్థినికీ ప్రత్యేక ఫైలు, తరగతి గదిలో ఓ బాక్సు ఏర్పాటు చేశారు. వారికి సంబంధించిన మార్కులు, ఇతరత్రా వివరాలన్నీ అందులో ఉంటాయి. తల్లిదండ్రులు ఎప్పుడైనా పరిశీలించుకుని..తమ పిల్లల విద్యా ప్రగతిని తెలుసుకోవచ్చు. కొత్త పాఠశాల అయినప్పటికీ ఎన్‌సీసీ యూనిట్ కూడా ప్రారంభించారు. 50 మంది విద్యార్థినులు ఎన్‌సీసీ శిక్షణ పొందుతున్నారు. ప్రభుత్వం అందజేసిన ట్యాబ్‌ల వినియోగంలో ఇక్కడి విద్యార్థినులు ముందున్నారు. జూడో, హాకీ, క్రికెట్, వాలీబాల్, హ్యాండ్‌బాల్, బేస్‌బాల్ వంటి క్రీడల్లో రాణిస్తున్నారు. చిత్రలేఖనంలోనూ ప్రోత్సహిస్తుండడంతో పోటీపడి మరీ చిత్రాలు గీస్తున్నారు. వారు వేసిన చిత్రాలను పాఠశాలలో ప్రదర్శనకు పెడుతూ మరింత ఉత్సాహాన్ని నింపుతున్నారు. ప్రతి విద్యార్థినిపై ప్రత్యేక శ్రద్ధ ఉంచి క్రమశిక్షణ, జీవన నైపుణ్యాలు నేర్పుతున్నారు. సెక్షన్ల వారీగా తల్లిదండ్రులతో వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసి.. పిల్లల ప్రగతిని షేర్ చేస్తున్నారు. స్కూల్‌కు సంబంధించి యూట్యూబ్ చానెల్ (ఎంజేపీ నార్పల) నిర్వహిస్తున్నారు.

ఆకట్టుకుంటున్న గార్డెనింగ్

గురుకుల పాఠశాల ప్రాంగణంలో ఖాళీ స్థలాన్ని వృథాగా వదిలేయకుండా వివిధ రకాల మొక్కలు పెంచుతున్నారు. సేంద్రియ పద్ధతిలో ఆకుకూరలు, కూరగాయలు పండిస్తున్నారు. కూరలకు వీటినే వినియోగిస్తున్నారు. ప్రయోగాత్మకంగా వర్మీకంపోస్టు తయారీ కూడా ప్రారంభించారు. మొత్తమ్మీద అన్ని విషయాల్లోనూ పాఠశాల ఆదర్శంగా నిలుస్తోంది. పిల్లలు మంచి వాతావరణంలో చదువుకుంటుండడంతో తల్లిదండ్రుల్లోనూ సంతోషం వ్యక్తమవుతోంది.

కిచెన్ గార్డెన్ ప్రత్యేకం



మా స్కూల్‌లో కిచెన్ గార్డెన్ ప్రత్యేకంగా నిలుస్తోంది. దాదాపు అన్ని రకాల ఆకుకూరలూ మేమే పండిస్తున్నాం. ఎటువంటి రసాయనాలూ వాడని ఆకుకూరలు వినియోగించడం వల్ల మా ఆరోగ్యం బాగుంటోంది. ఇక్కడి వాతావరణం అద్భుతంగా ఉంది. మమ్మల్ని చదువులోనే కాదు.. ఎక్స్‌ట్రా కరికులర్ యాక్టివిటీస్‌లోనూ ప్రోత్సహిస్తున్నారు.

– ఎం.సబిత, తొమ్మిదో తరగతి

సౌకర్యాలు బాగున్నాయి



మా స్కూల్లో సౌకర్యాలు బాగున్నాయి. ఎన్‌సీసీ, స్పోర్ట్స్ ట్రైనింగ్, డిజిటల్ క్లాసెస్, లైబ్రరీ, ల్యాబ్ ఇలా అన్ని సౌకర్యాలు ఉన్నాయి. ప్రిన్సిపాల్ మేడం మమ్మల్ని సొంత బిడ్డల్లా చూసుకుంటున్నారు. ఇక్కడ చదువుకుంటున్నందుకు అదృష్టంగా భావిస్తున్నాం.

– ఆర్.తనుష్య, తొమ్మిదో తరగతి

నైతిక విలువలకు పెద్దపీట



విద్యారంగానికి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోంది. అందుకు తగ్గట్టు మేము కూడా విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తున్నాం. పిల్లలకు కేవలం చదువు చెప్పడమే కాదు..పోటీ ప్రపంచానికి తగ్గట్టుగా తీర్చిదిద్దుతున్నాం. ముఖ్యంగా నైతిక విలువలు, క్రమశిక్షణ నేర్పుతున్నాం. రేపు వారు ధైర్యంగా జీవించాలి.. సమాజానికి, దేశానికి ఉపయోగపడాలన్నదే మా తపన. ఇక పాఠశాల అభివృద్ధిలో ప్రభుత్వం, దాతలు, విద్యార్థినుల తల్లిదండ్రుల సహకారం మరువలేనిది.

–కె.సంగీత కుమారి, ప్రిన్సిపాల్, 'ఈస్ట్ నరసాపురం గురుకుల పాఠశాల'



నార్పలలోని గురుకుల బాలికల పాఠశాల భవనం



పాఠశాల భవనం నమూనా తయారు చేస్తున్న విద్యార్థినులు



జూడో శిక్షణ తీసుకుంటూ..

కుమార్తెకు పెళ్లయిన రెండు రోజులకే తండ్రి దుర్మరణం



ఆంజనేయులు (ఫైల్)

రామగిరి: కుమార్తెకు పెళ్లి చేసిన రెండు రోజులకే రోడ్డు ప్రమాద రూపంలో ఓ తండ్రిని మృత్యువు కబళించింది. ఎంతో ఆనందంగా ఉన్న పెళ్లింట విషాదం నింపింది. పోలీసులు తెలిపిన మేరకు... మండలంలోని గంతిమర్రి గ్రామానికి చెందిన ఆంజనేయులు (47), పోతక్క దంపతులు. రెండు రోజుల క్రితం కర్నూలు జిల్లా ప్యాపిలికి చెందిన ఓ వ్యక్తితో వీరి పెద్ద కుమార్తెకు వివాహం జరిగింది. పెళ్లి సజావుగా సాగడంతో ఆ కుటుంబం సంతోషంలో మునిగితేలింది. ఈ క్రమంలోనే శనివారం వ్యక్తిగత పని నిమిత్తం ఆంజనేయులు ద్విచక్రవాహనంలో ఎన్ఎస్‌గేట్‌కు వచ్చారు. తిరిగి వెళ్తున్న సమయంలో శ్రీహరిపురం గ్రామ సమీపంలో ఎదురుగా బొలేరో వాహనం ఢీకొంది. తీవ్ర గాయాలపాలైన ఆయనను 108 ద్వారా అనంతపురం తరలిస్తుండగా, మార్గమధ్యలో ప్రాణాలు కోల్పోయాడు. మృతునికి కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుమార్తెకు రెండు రోజుల క్రితం వివాహమైంది. ఈ క్రమంలోనే ఇంటి పెద్ద దిక్కు ప్రాణాలు కోల్పోవడంతో కుటుంబసభ్యులు గుండెలవిసేలా రోదించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఉప కేంద్రంలో టాస్క్‌ఫోర్స్ అధికారుల తనిఖీ



తలసీమియా పరీక్షలు చేస్తున్న టాస్క్‌ఫోర్స్ బృందం

తాడిమర్రి: కునుకుంట్ల వైద్య, ఆరోగ్య ఉపకేంద్రాన్ని శనివారం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ టాస్క్‌ఫోర్స్ బృందం తనిఖీ చేసింది. జిల్లా గణాంకాధికారి ఖలందర్, జిల్లా పబ్లిక్ హెల్త్ నర్స్ వీరమ్మ సబ్ సెంటర్‌లో పలు రికార్డులు పరిశీలించారు. అనంతరం వారు కుష్టు నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలకు సూచించారు. గ్రామంలో పర్యటించి విద్యార్థినులు, కౌమారదశ బాలికలు, గర్భిణులు, బాలింతలకు రక్తహీనత పరీక్షలు చేశారు. తలసీమియా రాకుండా ప్రతి ఒక్కరిని అప్రమత్తం చేయాలని వారికి సూచించారు. మాతాశిశు మరణాలు తగ్గించడానికి చేపట్టాల్సిన చర్యలను వివరించారు. చిన్నారులు, గర్భిణులకు వేయాల్సిన టీకాలు సక్రమంగా వేయాలని సిబ్బందిని ఆదేశించారు. సీహెచ్ఓ హేమలత, పీహెచ్ఎస్ లక్ష్మీ, ఎంపీహెచ్ఎలు నారాయణమ్మ, రామ్‌కుమార్, ఆరోగ్య కార్యకర్తలు జానకీరామ్ పాల్గొన్నారు.

రాయలసీమ బలిజ మహా సంఘం అధ్యక్షుడిగా శంకరయ్య

అనంతపురం కల్చరల్: రాయలసీమ బలిజ మహాసంఘం నూతన అధ్యక్షుడిగా తొండపునాటి శంకరయ్య ఎన్నికయ్యారు. స్థానిక శ్రీనివాస్ నగర్‌లోని కల్యాణమంటపంలో శనివారం కమిటీ సభ్యులు నూతన అధ్యక్షుడిని తాత్కాలికంగా ఎన్నుకున్నారు. అనంతరం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సంఘం మాజీ అధ్యక్షుడు పాములాయి వెంకటేష్ మాట్లాడుతూ రెండున్నరేళ్ల పాటు తనకు సహకరించిన ప్రతి సభ్యుడికి, బలిజ కులస్తులకు కృతజ్ఞతలు తెలిపారు. నూతన అధ్యక్షుడు శంకరయ్య మాట్లాడుతూ బలిజల అభ్యున్నతికి పాటుపడతానని తెలిపారు. కార్యక్రమంలో అన్ని పార్టీలకు చెందిన కుల పెద్దలు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నేడు పశుసంవర్ధక సహాయకుల ఎంపిక పరీక్ష



టెలీకాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న ఇన్‌చార్జ్ కలెక్టర్ కేతన్‌గార్గ్

అనంతపురం అర్బన్: పశుసంవర్ధక సహాయకుల ఎంపికకు ఆదివారం పరీక్ష జరగనుంది. అనంతపురం నగరంలోని అనంతలక్ష్మి ఇంజినీరింగ్ కళాశాల, శ్రీవెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాల, పీవీకేకే ఇంజనీరింగ్ కళాశాల, శ్రీ బాలాజీ పీజీ కళాశాల, రోటరీపురం వద్దనున్న ఎస్ఆర్ఐటీ (శ్రీనివాస రామానుజన్ ఇంజనీరింగ్ కళాశాల), తాడిపత్రిలోని సీవీరామన్ ఇంజినీరింగ్ కళాశాల, తాడిపత్రి ఇంజినీరింగ్ కళాశాలల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. 925 మంది అభ్యర్థులు హాజరు కానున్నారు.

గంట ముందే చేరుకోవాలి..

పరీక్ష ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతుంది. అభ్యర్థులను పరీక్ష కేంద్రంలోకి ఉదయం 8 నుంచి ఉదయం 9.15 గంటల వరకూ అనుమతిస్తారు. అభ్యర్థులు నిర్ణీత సమయానికి గంట ముందే కేంద్రాలకు చేరుకోవాలి. బయోమెట్రిక్ విధానం ద్వారా రిజిస్టర్ చేసిన తరువాతనే అభ్యర్థులను కేంద్రంలోకి అనుమతిస్తారు. హాల్ టికెట్‌తో పాటు ఏదేని గుర్తింపు కార్డును వెంట తెచ్చుకోవాలి. కేంద్రంలోకి ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించరు. హాల్ టికెట్‌లో అభ్యర్థి ఫొటో సరిగ్గా కనిపించకపోయినా, చిన్న సైజ్ ఫొటో ఉన్నా... గెజిటెడ్ అధికారి ద్వారా ధ్రువీకరించిన పత్రం, పదవ తరగతి మార్క్ మెమో నకలు, మూడు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలను తప్పక తీసుకురావాలి.

పకడ్బందీగా నిర్వహణ..

పశుసంవర్ధక సహాయకుల ఎంపిక పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని అనంతపురం ఇన్‌చార్జ్ కలెక్టర్ కేతన్‌గార్గ్ ఆదేశించారు. శనివారం సంబంధిత అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పరీక్షలు ఆన్‌లైన్ పద్ధతిలో జరుగుతాయన్నారు. కేంద్రాల వద్ద కనీస వసతులు కల్పించాలన్నారు. కోవిడ్ నేపథ్యంలో జాగ్రత్తలు పాటించాలన్నారు.

మత్తు పదార్థాలను పారదోలుదాం



మాట్లాడుతున్న డీఆర్‌ఓ కొండయ్య, అడిషనల్ ఎస్పీ విష్ణు

పుట్టపర్తి అర్బన్: మత్తు పదార్థాలను జిల్లా నుంచి పూర్తిగా పారదోలుదామని డీఆర్‌ఓ కొండయ్య, అడిషనల్ ఎస్పీ విష్ణు పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో శనివారం జిల్లా కోఆర్డినేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌ఓ మాట్లాడుతూ గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల వినియోగంపై దృష్టి సారించాలన్నారు. అన్ని కళాశాలల్లో ఫిర్యాదుల బాక్సులు ఏర్పాటు చేసి, విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. కర్మాగారాల్లో పని చేసే వారిని చైతన్యవంతం చేయాలన్నారు. అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ మత్తు పదార్థాలు వినియోగిస్తున్నట్టు తెలిస్తే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. గ్రామాల్లో ఎక్కడైనా గంజాయి సాగు చేస్తుంటే సమూలంగా నాశనం చేయాలన్నారు. ప్రజలు టోల్ ఫ్రీ నంబర్ 14500కు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఈఎస్ రవికుమార్, అర్బన్ సీఐ కొండారెడ్డి, డీఎంహెచ్ఓ కృష్ణారెడ్డి, డీఈఓ మీనాక్షి, జిల్లా ఉద్యానశాఖ అధికారి చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన భక్తరపల్లి బ్రహ్మోత్సవాలు





ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి, ఆంజనేయస్వామి

మడకశిరరూరల్: మండల పరిధిలోని భక్తరపల్లిలో లక్ష్మీనరసింహస్వామి, జిల్లెడుగుంట ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు శనివారం ఘనంగా ముగిశాయి. చివరి రోజు వసంతోత్సవం, చక్రస్నానం కనులపండువగా సాగాయి. ఉదయం స్వామి వార్లను ప్రత్యేకంగా అలంకరించి పురోహితులు వివిధ పూజలు చేపట్టారు. వివిధ గ్రామాల భక్తులు జ్యోతులను స్వామివారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవాలు సజావుగా సాగేలా సహకరించిన ప్రతి ఒక్కరికీ దేవదాయ శాఖ అధికారులు, రథోత్సవ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

లారీని ఢీకొన్న ఐచర్

- ముగ్గురికి స్వల్ప గాయాలు



దెబ్బతిన్న ఐచర్ ముందుభాగం

మడకశిర: పట్టణంలోని మధుగిరి రోడ్డులో శనివారం ఉదయం లారీని వెనుక నుంచి ఐచర్ వాహనం ఢీకొంది. స్పీడ్ బ్రేకర్ వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. ఉదయాన్నే పొగమంచు ఎక్కువగా ఉండడం ప్రమాదానికి కారణంగా భావిస్తున్నారు. ఘటనలో ఐచర్ వాహనంలో ఉన్న ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. వారిని 108లో మడకశిర ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందించారు. స్థానిక ఎస్ఐ లోకేష్ ఘటనా స్థలాన్ని సందర్శించి పరిశీలించారు. కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

5న ఇంటర్వ్యూలు

పుట్టపర్తి టౌన్: ఆర్టీసీలో అప్రెంటిస్‌షిప్‌కు ఎంపికైన అభ్యర్థులు జనవరి 5న ఇంటర్వ్యూలకు హాజరు కావాలని డీపీటీఓ మధుసూదన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. డీజిల్ మెకానిక్ సీరియల్ నంబర్ 26, 53,12, 9, 52,67, 68, 79, 70, 13,69, 16, 83, 47,105, 45, మోటర్ మెకానిక్ 22,23, ఎలక్ట్రీషియన్ 18, 85,4, వెల్డర్ 01 ట్రేడ్ వైజ్ సీరియల్ నంబర్లు ఉన్న అభ్యర్థులు కర్నూలులోని శిక్షణ కళాశాలలో ఉదయం 9 గంటలకు ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలన్నారు. పదో తరగతి మార్కుల జాబితా, ఆధార్‌కార్డ్, జనన, కుల ధ్రువీకరణ పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్, బ్యాంక్ అకౌంట్ బుక్ మూడు సెట్ల జిరాక్సులతో పాటు పాస్ ఫొటోలు తీసుకురావాలని సూచించారు.

కారుడిపల్లి పాఠశాల హెచ్ఎం సస్పెన్షన్

హిందూపురం అర్బన్: మండలంలోని కారుడిపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శివగంగాధర్ సస్పెండ్ అయ్యారు. ఈ మేరకు డీఈఓ మీనాక్షి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. పాఠశాలకు మద్యం మత్తులో హాజరవుతుండడం, సకాలంలో వెళ్లకపోవడం, 'నాడు-నేడు' పనుల్లో అవకతవకలకు పాల్పడడం తదితర ఆరోపణలు ఆయనపై వచ్చాయి. కిందిస్థాయి అధికారులు విచారణ చేపట్టి ఉన్నతాధికారులకు నివేదికలు పంపారు. ఈ క్రమంలోనే శివగంగాధర్‌ను సస్పెండ్ చేసినట్లు ఎంఈఓ గంగప్ప తెలిపారు.